మహిళా చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-చింతపల్లి : అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు, చింతపల్లి ఎస్సై వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ వేణుగోపాల్ మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళలు తమ ఆత్మరక్షణ కోసం మహిళా చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళలు, విద్యార్థినులు ఒంటరిగా ఉన్నప్పుడు, రహదారులపై నడుస్తున్నప్పుడు కొంతమంది అగంతకులు ఇబ్బందులు కలిగించే ప్రయత్నాలు చేస్తారని, అటువంటి సందర్భాల్లో వారికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గోవింద్ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ వేణుగోపాల్

గోదావరి వరద ఉధృతి పెరుగుతున్న దృష్ట్యా..

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

-జిల్లా కలెక్టర్‌దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు, : గోదావరి ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో రెండవ ప్రమాద హెచ్చరిక జారీ కానున్న దృష్ట్యా మరింత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ సూచించారు. బుధవారం గోదావరి నీటి ఉధృతి అధికంగా ఉన్నందున రెండవ ప్రమాద హెచ్చరిక జారీ కానున్న దృష్ట్యా చెపడుతున్న ముందస్తు చర్యలపై ఎఎస్ఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్, రంపచోడవరం, చింతూరు ప్రాజెక్ట్ అధికారులు, రంపచోడవరం సబ్ కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి, పోలవరం పిఐపి.ఎల్ ప్రత్యేక కలెక్టర్, జిల్లా, డివిజనల్ స్థాయి అధికారులు, తహసీల్దార్, ఎంపిడిఓలతో జిల్లా కలెక్టర్ టేలీకాన్ఫరెన్స్ నిర్వహించ్చారు. ముందుగా ముంపునకు గురైయ్యే మండలాలైన రంపచోడవరం, చింత్తూరు, విఆర్ పురం మండల తహసీల్దార్లతో రెండవ ప్రమాద హెచ్చరిక జారీ కానున్న దృష్ట్యా సిద్ధంగా ఉండాలని, ప్రజలకి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ముందస్తు చేర్యలు చేపట్టాలన్నారు. ముందుగా ముంపునకు గురైన ప్రాంతాలను గుర్తించి అక్కడి ప్రజలను తుఫాన్ రిలీఫ్ కేంద్రాలకు తరలించేలా చర్యలు చేపట్టాలన్నారు. మందులు అందుబాటులో ఉండాలన్నారు. అవసరమైనచోట్ల లోతట్టు ప్రాంత ప్రజలను ముఖ్యంగా గర్భవతులు, బాలింత తల్లులు, చిన్నారులు, వృద్ధులను, వైద్య సహాయం అత్యవసరంగా కావలసినవారిని ప్రత్యేక శ్రద్ధతో పునరావాస కేంద్రాలకు తరలించేందుకు కావలసిన ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచుకోవాలని, కావలసిన జనరేటర్లు, త్రాగునీరు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. దండోరా వేసి ప్రజలకు అప్రమత్తం చేయాలన్నారు. సంబంధిత అధికారులు నేరుగా గ్రామాలకి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకొని సత్వరం పరిష్కరించాలని, ఎక్కడా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా ముందస్తు అప్రమత్తం అవసరమన్నారు. రెండవ ప్రమాద హెచ్చరికకు ముంపునకు గురైన ప్రాంతాలను గుర్తించి అక్కడి ప్రజలను తుఫాన్ రిలీఫ్ కేంద్రాలకు తరలించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ, పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ అభిషేక్, రంపచోడవరం, చింతూరు ప్రాజెక్ట్ అధికారులు కె. సింహాచలం, అపూర్వ భరత్, చింతూరు ఎఎస్పి, జిల్లా రెవెన్యూ అధికారి కె పద్మలత, వివిధ శాఖల అధికారులు సంబంధిత మండలాల ఎంపిడిఓలు, తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలి

-సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స-జెసికి వినతి

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరుకు సమీప గ్రామాల్లో మంచినీటి సౌకర్యం మెరుగు పరచాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనరస డిమాండ్ చేశారు. పాడేరు మండలంలోని చింతలవీధి పంచాయతీ ఉబ్బేడిపుట్ మెట్ట వీధి గ్రామానికి చెందిన ఆదివాసీ తెగ (కోందు)కు చెందిన పి.వి.టీ.జిలకు తాగు నీరు సదుపాయాలు కల్పించాలని గ్రామస్తులతో కలిసి ఆయన బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అప్పలనరస తాగునీటి సమస్య తీవ్రతను వివరించారు. అధికారులకు 4 సార్లు వినతిపత్రం సమర్పించినా కనీసం స్పందించడం లేదని, బోర్లు మరమ్మత్తు కూడా అధికారులు చేయలేదని తెలిపారు. కొందు తెగకు చెందిన గిరిజనులు సుమారు 200 మంది ఉన్నారని, అత్యంత దయనీయమైన పరిస్థితుల్లో, దుర్భరమైన జీవనం సాగిస్తున్నారన్నారు. మౌలిక సదుపాయాలు కనీసం లేవని వివరించారు. తక్షణమే గ్రామంలో ప్రజలకు ట్యాంకుల ద్వారా తాగు నీరు అందించాలని కోరారు. పీఎం జర్మన్ స్కీమ్ లేదా జల జీవన్ మిషన్ కింద తక్షణమే తాగునీరు సదుపాయంకి నిధులు మంజూరు చేస్తామని, తక్షణ ఉపశమనం కోసం తాగునీరు బోరు రిపేర్ చేయడానికి, వాటర్ ట్యాంక్‌ల ద్వారా నీళ్ల సరపరా చేయుటకు ఆర్డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్‌కి ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎల్ సుందర్ రావు గ్రామస్తులు పాల్గొన్నారు.

జెసికి వినతిపత్రం ఇస్తున్న అప్పలనర్స, గ్రామస్తులు

సంతలో నిలిచిన వాహనాలు

ప్రజాశక్తి-అనంతగిరి:అనంతగిరి -అరకు ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ జామ్ అయ్యింది. ప్రతి బుధవారం డముకు, కాశిపట్నం గ్రామ మెయిన్ రోడ్డులో రద్దీ కారణంగా విశాఖ -ఎస్.కోట నుండి అరకు, అరకు, అనంతగిరి ప్రాంతం నుండి మైదాన ప్రాంతాలకు రాకపోకలు సాగించే వాహనాలు తప్పించుకుని వెళ్లేందుకు ఆస్కారం లేకపోవడంతో గంటల తరబడి ట్రాఫిక్ జాం ఏర్పడింది. అనంతగిరి, అరకు ప్రముఖ పర్యాటక కేంద్రాలు తిలకించేందుకు విదేశీ, ఇతర ప్రాంతం నుండి వేలాది మంది సందర్శిస్తుంటారు. ప్రతి బుధవారం ఈ ప్రాంతాలలో జరిగే వారపు సంతలకు ఎస్.కోట, విజయనగరం, కొత్తవలస, తదితర మైదాన ప్రాంతం నుండి అధికమంది చిరు వ్యాపారస్తులు వ్యాపారాలు సాగిస్తుంటారు. అధికంగా వాహనాలు కూడా రావడంతో ట్రాఫిక్ స్తంభించి పోతుంది. ఇప్పటికైనా స్థానిక రెవిన్యూ, పోలీస్ అధికారులు దీనిపై దృష్టి సారించాలని వాహనదారులు కోరుతున్నారు.

నిలిచి పోయిన వాహనాలు

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తీసుకురావాలి

-కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి

అభివాదం చేస్తున్న కృపారాణి, నాయకులు

ప్రజాశక్తి-చింతపల్లి : కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి పిలుపునిచ్చారు. చింతపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు వంతల సుబ్బారావు ఆధ్వర్యంలో హనుమాన్ జంక్షన్ నుంచి రంగా సెంటర్, పాత బస్టాండ్ కూడలి మీదుగా సంతబయలు వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం అక్కడ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఇందులో పీసీసీ కార్యనిర్వాహక మాజీ అధ్యక్షురాలు సుంకరి పద్మశ్రీ, ఒరిస్సా రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మాజీ మంత్రి జయరాం పాంగి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృపారాణి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే మారుమూల గిరిజన గ్రామాలకు విద్య, వైద్యం, రహదారి సౌకర్యాలు, పాఠశాలలు, కళాశాలలు వంటి మౌలిక వసతులు కల్పించడం జరిగినంది గుర్తు చేశారు. గిరిజన ప్రాంతంలోని బాక్సైట్ నిక్షేపాలపై కన్నేసిన కూటమి ప్రభుత్వం వాటిని తరలించుకుపోవడానికి ప్రయత్నించడం సమంజసం కాదన్నారు. ఎస్సి, ఎస్టి ఉప ప్రణాళిక ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజన ప్రాంత అభివృద్ధికి అధిక నిధులు కేటాయించిందని పేర్కొన్నారు. జీవో నంబర్ 3 రద్దు చేయడం వల్ల గిరిజన నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు దూరమయ్యాయన్నారు. జీవో నంబర్ 3కి ప్రత్యామ్నాయ జీవోలను వెంటనే విడుదల చేసి గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా చింతపల్లి మాజీ ఎంపీపీ వంతల బాబురావుతో పాటు వివిధ మండలాలకు చెందిన సుమారు 150 మంది వైసీపీ నాయకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో కడప మాజీ డిసిసి అధ్యక్షుడు జి.శ్రీరాములు, విజయనగరం డిసిసి మాజీ అధ్యక్షుడు రమేష్ కుమార్, శ్రీకాకుళం డిసిసి మాజీ అధ్యక్షుడు జీవి కేశవరావు, పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి షేక్ మహమ్మద్ జానీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు కిల్లి రామ్మోహన్‌రావు, కొర్ర చిరంజీవి, మర్రి గురుమూర్తి, శాంతమ్మ, మొట్టడం బాలరాజు, గేమ్మెలి బొజ్జన్న, వంతల శ్రీను, పాంగి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై పోరాటానికి సిద్ధం కండి

సిఐటియు

ప్రజాశక్తి-అరకులోయరూరల్:కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని కార్మిక వర్గానికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జె.భగత్ రాం పిలుపునిచ్చారు. అరకులోయ మండల కేంద్రంలోని ఆదివాసి గిరిజన సంఘం భవనంలో బుధవారం అరకులోయ సిఐటియు మండల కమిటీ విస్తత స్థాయి సమావేశం సాగర ప్రభుదాస్ అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా భగత్ రాం మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నష్టం చేకూర్చేలా ఉందని, దీన్ని సిఐటియు ఖండిస్తుందన్నారు. కార్మికుల హక్కులను రక్షించవలసిన బదులు, ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన చట్టాలు, నిర్ణయాలు కార్మిక వర్గాలను దెబ్బతీస్తున్నాయని ఆయన విమర్శించారు.పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగలేదని, దీంతో కార్మిక కుటుంబాలు ఆర్థికంగా నష్టం పోతున్నారన్నారు. తక్షణం అన్ని ప్రభుత్వ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్,డైలీ వేజ్ కార్మికులకు కనీస వేతనం 26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, కార్మికుల శ్రేయస్సు కోసం పోరాడుతున్న సిఐటియు, కార్మిక హక్కులపై జరుగుతున్న దాడులను నిరోధించేందుకు కార్మికులంతా ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వివిధ రంగాల ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు వెంకటలక్ష్మి, మధ్యాహ్న భోజనం వర్కర్స్ యూనియన్ నాయకులు దామోదర్, భవన నిర్మాణం కార్మిక సంఘం నాయకులు ప్రభుదాసు, శ్రీను, ఐకెపి వర్కర్స్ యూనియన్ నాయకులు చిన్ని, ఐటిడిఏ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు దాడి రాజు, జిసిసి సోప్ యూనిట్ వర్కర్స్ యూనియన్ నాయకులు సింహాద్రి,ప్రభాకర్, హాస్పటల్ వర్కర్స్, తదితర కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు నేత భగత్‌రాం

నేడు సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-పెదబయలు : స్థానిక గిరిజన రెసిడెన్షియల్ బాలుర పాఠశాల/కళాశాలకు సిసి రోడ్డు నిర్మాణానికి ఉమ్మడి విశాఖ జిల్లా జెడ్‌పి చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రమ్మ శంకుస్థాపన చేయనున్నట్లు ప్రిన్సిపాల్ డి.సూర్య శంకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిసి రోడ్డుకు అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ సుమారు రూ.58 లక్షలు మంజూరు చేసినట్లు వెల్లడించారు.

పెరుగుతున్న గోదావరి ఉధృతి

భయం గుప్పెట్లో...

విఆర్‌పురం, కూనవరం మధ్య ఉన్న బ్రిడ్జి

ప్రజాశక్తి - విఆర్‌పురం: ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నదికి వరద ఉధృతి పెరుగుతోంది. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వరద ప్రవాహం పెరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే మండలంలో కూడా కురిసిన వర్షాలకు వాగులు వంకలు, చెరువులు పొంగి ప్రవహిస్తున్నాయి. అటవీ ప్రాంతంలో కురిసిన వర్షాలకు అన్నవరం వద్ద వాగు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో మండల వాసులు ఆందోళన చెందుతున్నారు. లోతట్టు గ్రామాలైన వడ్డి గూడెం, వడ్డిగూడెంకాలనీ, రామవరం, అడివెంకన్నగూడెం, చింతరేగుపల్లి, గుండుగూడెం, కన్నాయిగూడెం, గ్రామాలకు రహదారులపై వరదనీరు చేరటంతో రాకపోకలు నిలిచిపోయాయి. ప్రస్తుతం భద్రాచలం వద్ద బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు 45.90 అడుగులు చేరి రెండో ప్రమాద హెచ్చరిక చేరువలో వరద ప్రవహిస్తోంది. 55 అడుగులకు చేరితే ప్రజలు మూటముల్లె సర్దుకుని వెళ్లాల్సి వస్తుందని శబరినది వద్ద వరద ఉధతి కూడా పెరుగుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే మండలం లోని పలు గ్రామాల రోడ్లపైకి నీరు చేరింది. ఇంకో పది అడుగులు వస్తే రహదారులు పూర్తిగా తెగిపోతాయి. ఇప్పటికే ఒడ్డుగూడెం, ఒడ్డుగూడెం కాలనీ గ్రామాల ప్రజలు ట్రాక్టర్లపై ఇంటి సామాగ్రిని పునరావాస కాలనీలకు తీసుకువెళ్తున్నారు. తక్షణమే ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇచ్చి తరలించాలని ముంపు బాధితులు కోరుతున్నారు.

చింతూరు: భద్రాచలం గోదావరి నది వద్ద నీటిమట్టం బుధవారం పెరగడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. రాత్రి 11 లేదా 12 గంటలకు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేయవచ్చని అంచనా వేస్తున్నారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిఒ అపూర్వభరత్ పేర్కొన్నారు. కొయ్యగొరువాగు ఉధృతి తగ్గడంతో అంతరాష్ట్ర రహదారి ఒడిస్సా ఆంధ్ర ముంపు నుండి బయటపడింది వాహనాలు తిరిగి రాకపోకలు సాగిస్తున్నాయి. కొండ్రాజుపేట నుండి టేకులబోరు, చింతూరు నుంచి ముకునూరు, చింతూరు నుంచి చుట్టూరు, చింతరేగుపల్లి నుంచి కన్నాయి గూడెం, తుష్టివారిగూడెం నుంచి ఎవి గూడెం, రామవరం నుంచి రామవరం పాడు, ఇప్పూరు నుంచి పోచవరం రోడ్, జీడుగుప్ప నుంచి ములకపల్లి, ఉమ్మడివరం నుంచి అన్నవరం, తోటపల్లి నుంచి సీతంపేట, నెల్లిపాక నుంచి వీరిగూడెం, కన్నయ్యగూడెం నుంచి గట్టుగూడెం రోడ్లు బ్లాక్ అయ్యాయని తెలిపారు. ప్రజలు అత్యవసరం అనుకుంటే తప్ప రాకపోకలు సాగించవద్దని పిఒ అపూర్వభరత్ తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో సబ్ కలెక్టర్ కంట్రోల్ రూమ్ లేదా సదరు తహసీల్దార్ కార్యాలయం కంట్రోల్ రూమ్‌ను సంప్రదించవలసిందిగా పేర్కొన్నారు. సబ్ కలెక్టర్ కంట్రోల్ రూమ్ నెంబర్ 9490026397, 8121729228, 9701026397 కూనవరం కంట్రోల్‌రూమ్ 9652814712, విఆర్‌పురం కంట్రోల్ రూమ్ 8008100892, చింతూరు కంట్రోల్ రూమ్ 9492527695, ఎటపాక కంట్రోల్‌రూమ్ 8332085268 నంబర్లను సంప్రదించాలన్నారు.

చింతరేగుపల్లి కన్నాయిగూడెం మధ్య

బోటు ఏర్పాటుచేయాలి

ముంపు గ్రామాలు పరిశీలిస్తున్న ఎంపిటిసి ప్రదీప్‌కుమార్ తదితరులు

ప్రజాశక్తి -విఆర్‌పురం: మండలంలో ముంపునకు గురైన గ్రామాలను సందర్శించిన ఎంపిటిసి పూనం ప్రదీప్‌కుమార్‌తో పాటు సిపిఎం బృందం. ఎంపిటిసి పూనం ప్రదీప్‌కుమార్, సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ చిన్నమట్టపల్లి పంచాయతీలోని చింతరేగుపల్లి నుండి కన్నాయిగూడెం మధ్యలో బోటు ఏర్పాటు చేయాలని తహశీల్దార్ సరస్వతికి విన్నవించారు. కానీ బోటు ఏర్పాటు చేయకపోవటం వలన బుధవారం వైద్య సిబ్బంది బోటు లేక వెళ్లేందుకు ఇబ్బంది పడ్డారు. ఇప్పటికైనా బోటు ఏర్పాటు చేయాలని ఎంపిటిసి పూనం ప్రదీప్‌కుమార్, పులి సంతోష్‌కుమార్ డిమాండ్ చేసారు. పంకు సత్తిబాబు, పొడియంశ్రీరామ్మూర్తి కారం సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి : ఎంపిపి లక్ష్మి

ముంపు మండలాల్లో వరద సమస్యలు పరిష్కరించాలని, తక్షణమే వరద ప్రభావిత ప్రాంతాల్లో బోట్లు ఏర్పాటు చేయాలని, మండలానికి ఇన్‌చార్జి తహశీల్దార్‌ని నియమించాలని ఎంపిపి కారం లక్ష్మి కలెక్టర్‌తో మాట్లాడారు. సమస్య విన్న కలెక్టర్ స్పందించి గురువారం ఉదయం నుంచి అన్ని ప్రాంతాల్లో బోట్లు ఏర్పాటు చేస్తామని, మండలంలో అధికారులను అప్రమత్తం చేస్తామని హామీ ఇచ్చారు. స్పందించిన కలెక్టర్‌కు ఎంపిపి కారం లక్ష్మి ధన్యవాదాలు తెలిపారు.

IN THE COURT OF THE VI ADDITIONAL JUNIOR CIVIL JUDGE, KAKINADA
I.A.No.149/2023 in O.S.No.987/2023
Between:-
State Bank of India,Sarpavaram Junction Branch, Kakinada represented by it's Branch Manager ...**Petitioner/Plaintiff**
And
1. Mistri Apparao ...**Repondent/Deffendant**
To. Mistri Apparao S/o. Rama rao,Hindu, D.No.5-181, Rajavommangi, Rajavommangi Mandal.
పై నెంబరు దావా మరియు పిటిషన్‌లో ప్రతివాది/ రెస్పాండెంట్ అయిన మీకు శ్రీ కోర్టువారి ద్వారా ఎన్నిసార్లు సమున్లు/నోటీసులు పంపినను, మీరు తీసుకొనకుండ ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం ది.01-09-2025 సం॥రం తేదికి వాయిదా వేసినారు మీరు ఆరోజు ఉదయం 10.30ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.
K.V.S.V.LAKSHMAJI RAO (VENU)
Advocate, Kakinada
cell.9866211196

పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న పిఒ సింహాచలం

విద్యతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి -రంపచోడవరం : ఏజెన్సీలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు విద్యతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం పేర్కొన్నారు. బుధవారం మారేడుమిల్లి మండలం దేవరపల్లిలో గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ముందుగా ఎంతమంది విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారన్న విషయం ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాఠశాల చుట్టుపక్కల ఎప్పటికప్పుడు దోమలు ప్రబలకుండా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఒకటికి రెండుసార్లు పాఠాలను బోధించాలన్నారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం మెనూ పక్కాగా అమలు చేయాల న్నారు. ఇళ్లకు వెళ్లిన విద్యార్థులను వారం రోజుల లోపు తిరిగి తీసుకురాకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెచ్ఎం నాగేశ్వరరా వు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం పెద్దగెద్దాడ మండల పరిషత్ పాఠశాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం పక్కగా అమలు చేయాలని అన్నారు. పాఠ్యపుస్తకాలు అందినది లేనిది ఆరా తీశారు.

డంపింగ్ స్థలం గుర్తించి నివేదిక ఇవ్వాలి

ప్రజాశక్తి- రంపచోడవరం: రంపచోడవరం పంచాయతీలో చెత్త వేసేందుకు డంపింగ్‌కు సంబంధించిన స్థలం గుర్తించి నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం ఆదేశించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పంచాయతీలో చెత్త ఎక్కడపడితే అక్కడ వేయకుండా డంప్‌నకు సంబంధించిన స్థలం గుర్తించి నివేదిక అందించాలని సబ్‌కలెక్టర్, తహసిల్దార్‌ని ఆదేశించారు.

కలెక్టరు వారి కార్యాలయం, అల్లూరి సీతారామరాజు జిల్లా
రేఖా నెం.10/2024/CPO/DySO(Pig) తేదీ.20.08.2025
ప్రకటన
స్వర్ణాంధ్ర @2047 సాధనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం వారి ఆదేశాల మేరకు జిల్లా మరియు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన విజన్ ఏక్షన్ ప్లాన్ యూనిట్లకు అవసరమగు Computers(24), Laptops(8), Printers duplex(6), High Speed Scaners(4), 1KV Microtech UPS(9), Executive Chairs & Tables (7), Tables Cubicals (5X5) (24), Staff Chairs (26), Plastic Chairs (50), Ceiling fans (16) మరియు ACs(5) మొదలైనవి సరఫరా కొరకు సీల్డ్ కవర్ టెండర్స్ కోరబడుచున్నవి. ఆసక్తి గలవారు తే.28.08.2025ది సాయంత్రం 5 గంటల లోపు శ్రీ జిల్లా అర్థ గణాంక అధికారి వారి కార్యాలయం, కలెక్టరేట్, పాడేరు, అల్లూరి సీతారామరాజు జిల్లా నందు టెండర్ దాఖల చేయగలరు. తదుపరి వివరాల కొరకు శ్రీ జిల్లా అర్థ గణాంక అధికారి కార్యాలయం, పాడేరు, **అల్లూరి సీతారామరాజు జిల్లా**లో సంప్రదించగలరు.
సం./- సంయుక్త కలెక్టర్ & చైర్మన్ పర్చేజింగ్ కమిటీ, అల్లూరి సీతారామరాజు జిల్లా

మలేరియా నిర్మూలనపై అవగాహనా ర్యాలీ

చింతపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు

ప్రజాశక్తి-చింతపల్లి : మండల కేంద్రంలో మలేరియా టెక్నికల్ అసిస్టెంట్ శ్రావణి సంధ్య ఆధ్వర్యంలో మలేరియాపై అవగాహనకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు 'దోమల పెరుగుదల నివారిద్దాం- మలేరియా వ్యాధిని అరికట్టుదాం,' 'ఇంటి పరిసరాలలో నిల్వ నీరు ఉండనీయకండి', 'దోమతెరలు వాడుదాం- ఆరోగ్యంగా బతుకుదాం' వంటి నినాదాలు చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్‌వి.నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె.రాజా రవీంద్రనాథ్ చౌదరి మాట్లాడుతూ మలేరియా వంటి కీటకజనిత వ్యాధుల నియంత్రణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రజలు కాచి చల్లార్చిన నీటినే తాగాలని, వేడివేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఈఓ జాన్సన్, హెల్త్ అసిస్టెంట్లు కెవిఎస్.నెహ్రూ, సత్యారావు, ఏఎన్ఎంలు ఎస్.వరలక్ష్మి, డి.వెంకటరమణమ్మ, పి.పద్మ, పెంట కుమారి, ఎం.నాగరత్నం, ఎస్.విజయలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పిలు ఈ.లక్ష్మి, పావని, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విఆర్‌పురం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని బుధవారం రేఖపల్లి పిహెచ్‌సి ఆధ్వర్యంలో దోమల నివారణ ర్యాలీ నిర్వహించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకై ఉమ్మడి భాగస్వామ్యంతో ఉద్యమిద్దాం నీటి నిల్వలను తొలగిద్దాం.. దోమతెరలు వాడదాం అని నినదించారు. వరద ఉధృతితో రోడ్లు బ్లాక్‌అయిన గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహిస్తామన్నారు. పెద్దమటపల్లి సబ్ సెంటర్‌లో ఒక వైద్యఉద్యోగిని నియమించామని తెలిపారు. కార్యక్రమంలో పిహెచ్ భద్రకాళి, హెచ్‌వి సీత, ఏఎన్ఎం లక్ష్మీపార్వతి ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆసుపత్రి భవన నిర్మాణాల్ని వేగవంతం చేయాలి

ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న నీలవేణి

ప్రజాశక్తి-చింతపల్లి : గిరిజన ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చింతపల్లి ఏరియా ఆసుపత్రి నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని అల్లూరి జిల్లా ప్రాంతీయ ఆసుపత్రుల సమన్వయ అధికారిణి నీలవేణి ఆదేశించారు. బుధవారం ఆమె స్థానిక వైద్యాధికారిణి రుక్మిణితో కలిసి ఆకస్మిక ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై గుత్తేదారుడిని ప్రశ్నించారు. ఇప్పటికే భవన నిర్మాణం సగానికిపైగా పూర్తయినప్పటికీ, మిగిలిన పనులు నత్తనడకన సాగుతున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. రోగులకు పెరుగుతున్న అవసరాలను దృష్టిలో ఉంచుకొని పనులు వేగవంతం చేసి, ఆసుపత్రిని త్వరితగతిన వైద్య ఆరోగ్యశాఖకు అప్పగించాలని ఆదేశించారు. వసతి గదులు, అత్యవసర వైద్య పరికరాలు, ల్యాబ్ సదుపాయాలు అన్నీ సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ అనిల్, ఇంజనీర్ బాలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎంఆర్ వేతనాల స్థిరీకరణ

జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ

సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: 2024-2025 ఎన్ఎంఆర్ వేతనాల స్థిరీకరణలో నిర్దేశిత వేతనాలు అందజేయాలని జెసి ఎంజె అభిషేక్ గౌడ అన్నారు. బుధవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో 2024-2025 సంవత్సరానికి సంబంధించి దినసరి వేతనాల స్థిరీకరణకు సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2024-25 ఎన్ఎంఆర్ టెక్నికల్/ నాన్ టెక్నికల్ వేతనాలు స్థిరీకరించారు. నాన్ టెక్నికల్ స్కిల్డ్ రూ. 629, సెమీస్కిల్డ్ రూ.524, అన్ స్కిల్డ్ రూ.472 గా స్థిరీకరణ చేయగా, టెక్నికల్ ఐటిఐ క్వాలిఫికేషన్ వర్క్ ఇన్స్పెక్టర్ కు రూ.739, ఎల్ సిఇ / ఎల్ఎంఇ/ ఎల్ఇఇ వర్క్ ఇన్స్పెక్టర్ కు రూ.1022, బిఇ (సివిల్, మెకానికల్ అండ్ ఎలక్ట్రికల్)కు రూ.1315గా స్థిరీకరణ చేయడం జరిగిందని వెల్లడించారు. ఈ స్థిరీకరణ జూలై 1, 2024 నుండి జూన్ 30, 2025 వరకు అల్లూరి జిల్లా మొత్తం వర్తిస్తుందన్నారు. ఈ సమావేశంలో లేబర్ ఆఫీస్ సహాయ కమిషనర్ టి.సుజాత, ముఖ్య ప్రణాళిక అధికారి పి.ప్రసాద్, ఎడిఎంహెచ్ఒ టి.ప్రతాప్, ఇరిగేషన్ ఎస్‌సి ఆర్.నాగేశ్వరరావు, జిల్లా మలేరియా అధికారి ఎమ్.తులసి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎ.ప్రేమ, సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

వికసించిన దాలియా పుష్పాలు



మూడు రంగుల్లో విరబూసిన దాలియా పూలు

ప్రజాశక్తి-హుకుంపేట: మండల కేంద్రంలోని ఓ ఇంటి పెరట్లో వికసించిన దాలియా పుష్పాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. పెరట్లో వికసించిన దాలియా పుష్పాలు తెలుపు, ఎరుపు, గులాబీ, నారింజ రంగుల్లో వికసించిన ఈ పూలు చూసిన వారికి కళ్లకు హాయినిస్తున్నాయి. రంగురంగుల పూలు అలరింపజేస్తున్నాయి. మధురమైన సుగంధ వాసనలతో మంత్రముగ్ధులను చేస్తున్నాయి. ఈ పుష్పాలు జులై, ఆగస్టు రెండు నెలల్లో మాత్రమే వికసిస్తాయి. మిగిలిన 10 నెలలు ఒక సాధారణ దుంపవలె నేలపై ఉంటాయి. ఇది కేవలం దుంప మాత్రమే. నాటితే మొక్క మొలిచి చక్కని పుష్పాలను వికసిస్తాయి.

గీతం వర్సిటీని సందర్శించిన రష్యా బృందం

ప్రజాశక్తి-మధురవాడ : ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, రష్యన్ యూనియన్ ఆఫ్ ఇండస్ట్రీయలిస్ట్స్ అండ్ ఎంట్రాప్రెన్యూర్స్ మధ్య నైపుణ్యాభివృద్ధిలో వ్యూహాత్మక భాగసామ్య ఒప్పందంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో పర్యటిస్తున్న రష్యా నిపుణుల బృందం బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. ఆర్ఎస్‌పిపి డిప్యూటి ఛైర్మన్ ఇవానోవ్ మైఖేల్, రాష్ట్ర ప్రభుత్వ సలహదారు సీతాశర్మ ఆధ్వర్యంలో నిపుణుల బృందం రాష్ట్రంలోని సాంకేతిక విద్య, బోధన విధానాలు, మూల్యాంకనం, పారిశ్రామిక శిక్షణ, ఉపాధి అవకాశాలపై సుదీర్ఘంగా చర్చించింది. ముఖ్యంగా మెకానికల్, ఎలక్ట్రికల్, మెటలర్జి, వెల్డింగ్ టెక్నాలజీలకు సంబంధించిన సిలబస్‌ల, ప్రయోగశాలలను రష్యా నిపుణులకు వివరించారు.
పర్యటనలో భాగంగా గీతం విశ్వవిద్యాలయంలోని మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగాల ప్రయోగశాలలను రష్యన్ బృంద సభ్యులు పరిశీలించారు. అనంతరం సమావేశంలో గీతం ప్రో వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు మాట్లాడుతూ నైపుణ్యం గల మానవ వనరులను అందించడానికి పరిశ్రమలతో కలసి పనిచేస్తున్నామన్నారు. గీతం అధ్యాపకులు 25 కు పైగా పరిశోధనా ప్రాజెక్టులను నిర్వహిస్తున్నారని, వారి పరిశోధనలకు 208 పేటెంట్‌లు పొందారన్నారు. ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహించడానికి రూ.100 కోట్లకు పైగా స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్, డీన్ ప్రొఫెసర్ వి.రామశాస్త్రి, అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ కెకె.ప్రసాద్‌రావు, స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ ఎస్.అనంతరామకృష్ణ, సీనియర్ ప్రొఫెసర్లు భరణి చంద్రకుమార్, రాజేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

మల్టీ పర్పస్ కమ్యూనిటీ సెంటర్‌ను ప్రారంభానికి సిద్ధం చేయండి

జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ

ప్రజాశక్తి-పాడేరు: మల్టీ పర్పస్ కమ్యూనిటీ సెంటర్ భవనం ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ సూచించారు. ప్రధానమంత్రి జన్మన్ పథకంలో జిల్లాలో పాడేరు మండలం ముంతమామిడి గ్రామంలో నిర్మిస్తున్న బహుళ ప్రయోజన భవనాన్ని (మల్టీ పర్పస్ కమ్యూనిటీ సెంటర్) బుధవారం జాయింట్ కలెక్టర్ సందర్శించారు. భవన నిర్మాణ పనులపై సంతృప్తి వ్యక్తం చేస్తూ భవనం ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలన్నారు. ఈ భవనం ఒక మోడల్ భవనంగా తీసుకుని జిల్లాలో మిగిలిన భవనాల నిర్మాణం చేపట్టాలన్నారు. కావలసిన ఫర్నిచర్ సిద్ధం చేయాలని తెలిపారు. భవనంలో మల్టీ పర్పస్ హాలు, అంగన్‌వాడీ సెంటర్, ఈఎన్ఎం సబ్ సెంటర్ ఉంటాయని, భవనం వాడుకలోకి రావడానికి కావలసిన సిబ్బందిని సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో పాడేరు ట్రైబల్ వెల్ఫేర్ ఎఇ దుర్గాప్రసాద్, వనుగుపల్లి పంచాయతీ సెక్రెటరీ తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు

చిన్నారి కళాకారులతో ప్రజాశక్తి బృందం

నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్న కళాకారులు

ప్రజాశక్తి - గాజువాక : ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ కార్యాలయ నవీకరణ, నూతన యంత్రాల ప్రారంభోత్సవం, పత్రిక 45వ వార్షికోత్సవ సంబరాల్లో భాగంగా బుధవారం ఎడిషన్ కేంద్రంలో తలపెట్టిన చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వడ్లపూడికి చెందిన ఈష, ప్రియాంషి కృష్ణలీల నృత్య రూపకంలో చక్కని అభినయం కనబరిచారు. బాంధవ్య 'కొలువైతివ రంగస్వామి' ప్రదర్శన, వెన్నెల, పర్ణిక వినాయక స్తుతి నృత్యాలతో మెప్పించారు. వీరంతా యువ నృత్యకారిణి, నాట్య రవళి అముక్త మాల్యద వద్ద శిక్షణ పొందారు. వారి ప్రతిభను ప్రజాశక్తి జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు కె.అప్పలనాయుడు, వై.సత్యనారాయణ, ఎస్.రాజేష్ రెడ్డి, టి.అప్పలరాజు మెచ్చుకుని భవిష్యత్తులో మరిన్ని మంచి కళా ప్రదర్శనలిచ్చి నాట్యరంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం నృత్య శిక్షకురాలు అముక్త మాల్యదకు జ్ఞాపిక అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ప్రజాశక్తి సిబ్బంది, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు ముహూర్తపు రాట

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరు వర్తక సంఘ సభ్యుల ఆధ్వర్యంలో వినాయకచవితి ఉత్సవాలకు బుధవారం సంఘం కార్యాలయం ఎదుట ముహూర్తపురాట వేశారు. కార్యక్రమంలో స్థానిక మార్కెట్ వ్యాపారులు, ప్రజలు పాల్గొన్నారు. తొమ్మిది రోజులు ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు వర్తక సంఘ సభ్యులు సన్నాహాలు చేస్తున్నారు. సీలేరు పంచాయతీ పరిధి దుర్గావీధిలో గిరిజన యూత్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించేందుకు పూజాకార్యక్రమాలు నిర్వహించి అనంతరం ముహూర్తపు రాట వేశారు.

వ్యాక్సిన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఉపసర్పంచ్

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి -రంపచోడవరం : మండలం ఫోక్స్ పేట పంచాయతీ కే.ఎర్రంపాలెం ప్రాథమిక పాఠశాల, ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను ఉపసర్పంచ్ కారం సురేష్‌బాబు బుధవారం సందర్శించారు. వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించి సిబ్బందిని టిడి, స్పెషల్‌డ్రైవ్ వ్యాక్సిన్ వివరాలు తెలుసుకున్నారు. 20 మంది పిల్లలకు టిడి ఎలక్షన్, 220 మంది పిల్లలకు కంటి పరీక్షలు నిర్వహించగా 9 మంది పిల్లలకు కళ్ళజోళ్ళు కోసం పై స్థాయికి పంపించామని కంటి సహాయక వైద్యులు శ్యాంకుమార్ తెలిపారు. సీజనల్ వ్యాధులు రాకుండా పరిసరాల ప్రాంతాలు శుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం, వార్డెన్, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

ఎఆర్ మిషన్లు ఏర్పాటు

ప్రజాశక్తి-రంపచోడవరం: రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో కంటి సమస్యలు, దంతాల సమస్యలు నివారించేందుకు ఏఆర్ మిషన్లు, దంతాల సమస్యలు నివారించే విధంగా పరికరాలు ఏర్పాటు చేయడం జరిగిందని పిఒ సింహాచలం పేర్కొన్నారు. గిరిజన ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే ఉద్దేశ్యంతో ఏరియా ఆసుపత్రికి ఆధునిక ఎఆర్ మెషిన్ (కంటి పరీక్షల కోసం), డెంటల్ ఎక్స్‌రే పరికరం ఐటిడిఎ ద్వారా పరికరాలు అందజేస్తామన్నారు. ఈ పరికరాల ద్వారా గిరిజన ప్రజలు కంటిచూపు లోపాలను ఖచ్చితంగా గుర్తించి తగిన చికిత్సలు పొందగలరని, దంత సమస్యలను సమయానికి గుర్తించి చికిత్స చేయించుకోవచ్చున్నారు. ఐటీడీఏ ద్వారా గిరిజనుల ప్రజల ఆరోగ్యం కొరకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు.

షాపు యజమానికి సూచనలిస్తున్న సిఐ నరేంద్రప్రసాద్, ఎస్ఐ శ్రీనివాస్

పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్న వారిపై జరిమాన

ప్రజాశక్తి - మారేడుమిల్లి: మారేడుమిల్లి సిఐ నరేంద్రప్రసాద్, ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది ఆపరేషన్‌సేఫ్ క్యాంపస్‌లో బుధవారం విద్యాసంస్థలకు దగ్గరగా ఉన్న పాన్‌షాపుల్లో సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులు విక్రయించే షాపులపై దాడులు చేసి జరిమాన విధించారు. విద్యాసంస్థలకు దగ్గరగా ఉన్న షాపుల్లో పొగాకు ఉత్పత్తులు విక్రయించరాదని కౌన్సెలింగ్ చేశారు.

విద్యుత్‌స్తంభం పునరుద్ధరణ

విద్యుత్ స్తంభం వేస్తున్న జెన్‌కో సిబ్బంది

ప్రజాశక్తి -సీలేరు: చెట్టు విద్యుత్ స్తంభంపై కూలిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. జికె వీధి మండలం సీలేరు పంచాయతీ పరిధి పోలీస్‌స్టేషన్‌కి వెళ్లే రహదారి గేస్తేమని చర్చి సమీపంలో చెట్టు మంగళవారం రాత్రి విద్యుత్ స్తంభంపై కూలింది. ఆ సమయంలో వాహనదారులు పాదచారులు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం 6 గంటల వరకు 8వ క్రాస్‌రోడ్డు నుంచి దుర్గావీధి అల్లూరివీధి, శివాలయం, మార్కెట్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వ్యాపారులు వినియోగదారులు ఇబ్బందులకు గురయ్యారు. విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడడంతో అటు ఎపి జెన్‌కు ఇటు పంచాయతీకి తాగునీటి సరఫరా చేయడానికి అవకాశం లేకపోవడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న ఎపి జెన్‌కో ఇఇ రాజేంద్రప్రసాద్ ఆదేశాల మేరకు బుధవారం జెన్కో సబ్ ఇంజనీర్ ఇన్‌చార్జి ఎఇ నాగేష్ ఆధ్వర్యంలో ఎపి జెన్కో ఉద్యోగులు, కాంట్రాక్ట్ లేబర్ యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టారు. కూలిపోయిన విద్యుత్ స్తంభాన్ని తొలగించి దాని స్థానంలో కొత్త స్తంభాన్ని అమర్చారు. సాయంత్రం 6 గంటలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

రూ.432 కోట్లతో ముగిసిన అర్థసెలెక్ట్ ఫండ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అర్థ ఇండియా వెంచర్స్ (ఎఐవి) తన విన్నర్స్ ఓన్లీ ఫాలో ఆన్ వెహికల్, అర్థ సెలెక్ట్ ఫండ్ (ఎఎస్ఎఫ్) చివరి ముగింపును రూ. 432 కోట్లతో ప్రకటించిందని అర్థ వెంచర్ ఫండ్, అర్థ సెలెక్ట్ ఫండ్ మేనేజింగ్ భాగస్వామి అనిరుధ్ ఎ. దయాని తెలిపారు. నగరంలోని ఒక హోటల్లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఇది దాని అసలు లక్ష్యమైన రూ.330 కోట్లను 131 శాతం అధిగమించిందన్నారు. ఈ మైలురాయి అర్థయొక్క మొత్తం అసెట్స్ అండర్ మేనేజ్‌మెంట్‌ను (ఎయుఎం) రూ.1,200 కోట్లు దాటించిందని, తద్వారా ఫ్యామిలీ ఆఫీస్ మద్దతు ఉన్న భారతదేశపు మొట్టమొదటి, ఏకైక వెంచర్ క్యాపిటల్ సంస్థగా దాని స్థానాన్ని పటిష్టం చేసుకుందన్నారు. ఎఎస్ఎఫ్ అర్థ యొక్క ప్రస్తుత 135కి పైగా కంపెనీల పోర్ట్‌ఫోలియోలోని అగ్ర 15 శాతం ప్రదర్శనకారులలో పెట్టుబడి పెడుతుందని, ఈ ఫండ్ రాబోయే 4 సంవత్సరాలలో విజేతలకు, ఒక్కొక్కరికి సుమారు రూ.20 కోట్ల చొప్పున సిరీస్ బి,సి చెక్కులను రాస్తుందన్నారు.

ఆర్ఆర్ కేబుల్స్ సొల్యూషన్ శ్రేణి ప్రారంభం

ప్రజాశక్తి -ఎంవిపికాలనీ: భారత్‌లో వైర్లు, కేబుల్స్ తయారీలో అగ్రగామి అయిన ఆర్ఆర్ కేబుల్ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, పెరుగుతున్న విద్యుత్‌లోడ్లతో గుర్తించబడిన యుగంలో భారతీయ గ్రహాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి చెందుతున్న డిమాండ్లను పరిష్కరించడానికి రూపొందించిన తదుపరితరం వైర్ సొల్యూషన్ల శ్రేణిని ప్రారంభించింది. ఈ సందర్భంగా విశాఖలోని ఒక ప్రవేటుహోటల్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆర్ఆర్ కేబుల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేష్ కాబ్రా మాట్లాడుతూ కొత్త ఉత్పత్తి శ్రేణిలో ఫ్లామేక్స్ హెచ్‌ఆర్‌ప్లస్ ఎస్ఆర్, సూపర్ ఎక్స్‌గ్రీన్ హెచ్‌ఆర్ ప్లస్ ఎస్ఆర్, ఫైర్‌ఎక్స్ లాసోహ, ఇబీఎక్సెల్ ఉన్నాయని, ప్రతిఒక్కటి విభిన్న అనువర్తనాల్లో అత్యుత్తమ భద్రత, పనితీరు స్థిరత్వాన్ని అందించడానికి ఇంజనీరింగ్ చేయబడ్డాయన్నారు.

ఆయుర్వేద ఆహారంతో మెటిమలకు చెక్

ప్రజాశక్తి - ఎంవిపికాలనీ: రుతుపవనాల ప్రభావంతో వల్ల వచ్చే మొటిమలకు వీడ్కోలు చెప్పండి ఇవి తరచుగా స్వేదరంధ్రాలు మూసుకుపోవడం, చర్మంపై అదనపునూనె ఉత్పత్తి చేయటం, నిరంతర పగుళ్లు వంటి చర్మ సమస్యలకు దారితీస్తాయని ప్రముఖ ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ మధుమిత కృష్ణన్ తెలిపారు. బుధవారం బీచ్ రోడ్ లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆయుర్వేదం ప్రకారం, రుతుపవనాల సమయంలో వచ్చే కాలానుగుణ మార్పులు దోషాలను, ముఖ్యంగా వాత, పిత్త దోషాలను తీవ్రతరం చేస్తాయన్నారు. మొటిమలు లేదా దద్దుర్లు వంటి చర్మ సమస్యలకు దారితీస్తాయి. సరైన చర్మసంరక్షణతో పాటు, ఆహారం ద్వారా ఈ సీజన్లో చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చున్నారు. బాదం నుండి త్రిదోష సమతుల్య ఆమ్లా వరకు ఐదు ఆయుర్వేద సూపర్ఫుడ్లను ఆమె సిఫార్సు చేస్తున్నారు. బాదం, పసుపు, ఆమ్లా (భారతీయ గూస్బెర్రీ), వేప, వెల్లుల్లి తీసుకోవాలని సూచించారు. కాలిఫోర్నియా బాదం వంటి గింజలు, పసుపు వంటి సుగంధ ద్రవ్యాలను కలుపుకోవడం వల్ల ఈ తడి వాతావరణంలో కూడా మెరుస్తున్న చర్మం లభిస్తుందని తెలిపారు.

ఎస్‌హెచ్ఇ టీమ్స్ విస్తృత తనిఖీలు

- జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : విశాఖ నగర ప్రజల ఆరోగ్య పరి రక్షణ దిశగా జివిఎంసి ఏర్పాటు చేసిన ఎస్‌హెచ్ఇ టీమ్స్ (శానిటేషన్ అండ్ హెల్త్ ఎన్ఫోర్స్మెంట్ టీమ్స్) నగరంలో అన్ని జోన్లలో 'ఈట్ రైట్ క్యాంపైన్' ద్వారా విస్తతంగా తనిఖీలు నిర్వహించడం, ఆహార ఉత్పత్తుల్లో నాణ్యత పాటించని వారిపై కఠినచర్యలు చేపడుతున్నట్టు జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ బుధవారం ప్రకటన ద్వారా తెలిపారు. నగరంలో ప్రతి జోన్ పరిధిలో 2 టీమ్స్ చొప్పున మొత్తం 16 ఎస్‌హెచ్ఇ టీమ్స్‌ను ఈట్ రైట్ క్యాంపైన్ ద్వారా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటివరకు 8 జోన్లలో 76 చోట్ల తనిఖీలు నిర్వహించామని, 71 హోటళ్లకు, రెస్టారెంట్లకు, ఆహార విక్రయ కేంద్రాలకు నోటీసులు ఇవ్వగా 50 చోట్ల ఇప్పటికే రూ.68,600/- అపరాధ రుసుము వసూలు చేయడం జరిగిందని తెలిపారు.

చినుకు పడితే నరకమే..

బురదమయమైన దారి

ప్రజాశక్తి - రంపచోడవరం : మండల కేంద్రంలోని సాయినగర్ అంగన్వాడీ కేంద్రానికి వెళ్లే దారి బురదమయమైపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు వెళ్లలేకపోతున్నారని, మరోపక్క పౌష్టికాహారం కోసం ప్రతిరోజు వచ్చే గర్భిణులు, బాలింతల పరిస్థితి మరీ దయనీయంగా ఉందని వాపోతున్నారు. అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రానికి రహదారి వేయాలని కోరుతున్నారు.

బాలిక అదృశ్యం

ప్రమీల

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరు పంచాయతీ దుర్గా వీధికి చెందిన కొర్రప్రమీల (16) గత శుక్రవారం నుంచి అదృశ్యమైందని ఆచూకీ తెలిసినవారు సీలేరు పోలీస్‌స్టేషన్‌కి సమాచారం ఇవ్వాలని ఎస్ఐ రవీంద్ర కోరారు. బాలిక తల్లిదండ్రులు కొర్ర లక్ష్మణ్, కొర్ర మాలతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ప్రమీల సీలేరు జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆచూకీ తెలిసిన వారు 9440904234 సమాచారం ఇవ్వాలని ఎస్సై రవీంద్ర తెలిపారు.

ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి

నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి - చింతూరు : దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి బుధవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. రాజీవ్‌విగ్రహానికి పూలమాల నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు అహమ్మద్‌అలీ మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ పాలనలో దళిత గిరిజన సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. ఆయన ఆశయ సాధనలోనే అందరూ ముందుకు సాగాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టియుసి మండల అధ్యక్షులు ఎస్కే అక్బర్ నరేష్, బొక్కిలి ప్రసాద్, సోయం కన్నారావు, రవ్వ ప్రసాద్, ఎండి జవహర్ పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల వారికి నిత్యావసరాలు అందించాలి

ప్రజాశక్తి - విఆర్‌పురం: జలదిగ్బంధంలో ఉన్న గ్రామాల వాసులకు నిత్యావసర సరుకులు అందించాలని ఆర్‌టిఐ విభాగం అధ్యక్షులు బొడ్డు సత్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి చిక్కాలబాలు తదితరులు తహశీల్దార్ సరస్వతికి వినతిపత్రం అందించారు. శబరి గోదావరి ఉప్పొంగటంతో మండలంలో రహదారులపై నీరు ప్రవహిస్తోంది. రహదారులు పూర్తిగా బంద్ అయ్యే అవకాశం ఉందని శ్రీరామగిరి పంచాయతీ కన్నాయిగూడెం అడివివెంకన్నగూడెం గ్రామాల్లో బోట్లు ఏర్పాటు చేయాలని జలదిగ్బంధంలో చిక్కు కున్న గ్రామస్తులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని తహశీల్దార్ సరస్వతికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మాచర్ల గంగయ్య, ఆర్‌టిఐ విభాగం అధ్యక్షులు బొడ్డు సత్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి చిక్కాలబాలు, బిసి సెల్ జిల్లా కార్యదర్శి ముత్యాలగౌతం, మండల కమిటి సభ్యులు మూడు నరేష్ పాల్గొన్నారు.

నేడు మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : విశాఖపట్నం ఎంవిపి కాలనీలోని సమత కళాశాలలో గురువారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని కళాశాల డీన్ అండ్ కరస్పాండెంట్ ప్రొఫెసర్ విజయరవీంద్ర తెలిపారు. ద ప్లేస్‌మెంట్ పార్క్, కాన్సెంట్రిక్స్, హుందాయి, ఐఫోన్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్, ష్నైడర్ ఎలక్ట్రిక్, డబ్ల్యూ.ఎన్.ఎస్ గ్లోబల్ సర్వీసెస్, హెటిరో, డిక్సన్, ప్రీమియర్, యోకొహోమా, టాటా ఎలక్ట్రానిక్స్, డెక్కన్, జాబ్‌డీలర్స్, వెల్డన్ మార్కెటింగ్ ఏజెన్సీస్, కియా మొదలైన సుమారుగా 15 మల్టీనేషనల్ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాయని ఈ జాబ్ మేళాకు టెన్త్, ఇంటర్, డిప్లమో, డిగ్రీ ఉత్తీర్ణత ఉన్నవారు అర్హులు అన్నారు. బయోడేటా, ఆధార్ కార్డు, టెన్త్, డిప్లమో, డిగ్రీ జిరాక్స్ సర్టిఫికెట్లతో పాటు పాస్‌పోర్ట్‌సైజ్ ఫోటోతో హాజరు కావాలని తెలిపారు.

టెక్‌బి ప్రొగ్రాంతో పరిశ్రమ సంబంధిత నైపుణ్యం

ప్రజాశక్తి - విశాఖకలెక్టరేట్ : ప్రముఖ అంతర్జాతీయ టెక్నాలజీ కంపెనీ హెచ్‌సిఎల్‌టెక్ తమ టెక్‌బీ ఎర్లీ కెరీర్ ప్రోగ్రాంను వైజాగ్ లోని హైస్కూల్ గ్రాడ్యుయేట్స్‌కు అందివ్వడానికి, టెక్నాలజీ పరిశ్రమలో కెరీర్స్ ను రూపొందించే అవకాశం వారికి ఇవ్వడానికి ప్రణాళిక చేస్తోందని సంస్థ సీనియర్ ఉపాధ్యక్షులు బి.సుబ్బరామన్ తెలిపారు. విశాఖపట్నంలో ఆయన మాట్లాడుతూ, టెక్ బిఅనేది హైస్కూల్ గ్రాడ్యుయేట్స్ కోసం రూపొందించబడిన పరివర్తనాపరమైన కార్యక్రమమని, ఇది ఉన్నతమైన విద్యను పొందడానికి ప్రత్యక్షమైన టెక్నాలజీ శిక్షణను మిశ్రమం చేసే మోడల్‌ను నేర్చుకుంటూనే విలక్షణమైన సంపాదనను అందిస్తుందన్నారు. ఈ ప్రోగ్రాం విద్యార్థులకు పరిశ్రమ-సంబంధిత నైపుణ్యాలను అందచేస్తుందన్నారు. అభివృద్ధి చేయబడిన జనరేటివ్ ఎఐ, సైబర్ సెక్యూరిటిలో ప్రోగ్రాం ప్రత్యేకమైన ట్రాక్స్ ను పరిచయం చేయడానికి సిద్ధంగా ఉందన్నారు.